క్లుప్తంగా

నగరి ఆర్డీఓగా వెంకటరెడ్డి



నగరి : నగరి ఆర్డీఓగా వెంకటరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఆర్డీఓగా ఉన్న సుజన తుడాకు బదిలీపై వెళ్లడంతో కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన వెంకటరెడ్డి నగరి ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నిబద్ధతతో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. కార్యాలయానికి సంబంధిత వ్యవహారాలలో ఎలాంటి ఆలసత్వం లేకుండా సత్వరం పూర్తి చేస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ రవి



ఎంపీడీఓ భాస్కర్

గంగాధరనెల్లూరు: మండల తహసీల్దార్‌గా రవి, ఎంపీడీఓగా భాస్కర్ గురువారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల విధుల నిమిత్తం కర్నూల్ జిల్లా నుంచి తహసీల్దార్ రవి, నెల్లూరు జిల్లా నుంచి ఎంపీడీఓ భాస్కర్ జీడీ నెల్లూరు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో డీటీలు విజయకృష్ణ, తులసీరాం, సిబ్బంది తహసీల్దార్ రవికి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్‌కు కార్యాలయ సూపరింటెండెంట్ సుధాకర్, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్టీఐ యాక్ట్ యూనియన్ సభ్యులు స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి పలువురి సంతాపం



ఆర్ముగం (ఫైల్)

నగరి : నగరి మున్సిపాలిటీ కీళపట్టుకు చెందిన ఎస్.ఆర్ముగం (62) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన ప్రస్తుతం దేశమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన మృతికి పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

సచివాలయాల్లో జోరుగా రిజిస్ట్రేషన్లు



ఎస్వీఆర్‌పురం సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్వీఆర్ పురం గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఇళ్ల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు జోరుగా జరిగాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పర్యవేక్షించిన జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఎన్టీఐ పట్టాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా సచివాలయాల్లో ఎలాంటి రుసుం చెల్లించకుండా ఉచిత రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ చక్రవరి, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..వైభోగం



కల్యాణం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి కల్యాణం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. వీరరాఘవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవ స్వామికి శాస్త్రోక్తంగా రిత్వికులు కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో పట్టుశాలి దంపతులు, మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై వీరరాఘవ స్వామి ఊరేగింపు ఉంటుందని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది.

నేడు ఆలయంలో తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం తై అమావాస్యను పూజలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయం నుంచి శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భరద్వాజ తీర్థంలోని శివాలయానికి తీసుకెళ్లి విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నైవేద్యం, మంత్రపుష్పం, హారతుల అనంతరం స్వామి,అమ్మవార్లను బ్రహ్మగుడి, నాలుగు మాడవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆల్బెండజోల్‌తో ఆరోగ్యరక్ష

చిన్నారుల జీవితాన్ని నులిపురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పిల్లల అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోన్‌తో నివారించవచ్చు. రాష్ట్రప్రభుత్వం ఈ నెల 9వ తేదీ గంగాధరనెల్లూరు నియోజకవర్గవ్యాప్తంగా ఉచితంగా 24,649 మందికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనుంది. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం
- పిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- 0–19 ఏళ్లలోపు వారి మాత్రలు వేసేలా చర్యలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



విద్యార్థులకు ఆల్బెండజోన్ మాత్రలు వేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ(ఫైల్)

పాలసముద్రం : అపరిశుభ్రత వల్లే నులిపురుగులు ఎక్కువగా వ్యాప్తిస్తాయి. పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడం వల్ల కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది.

రక్షణ కోసం ఇలా..

బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. పెరిగిన గోళ్లు ఎప్పటికప్పుడు కట్ చేసుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి, పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తరువాతే వినియోగించాలి.

అనర్థాలు ఇలా..

నులిపునుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగజేస్తాయి. దీని వల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.



డీవార్మింగ్ పోస్టర్

నియోజకవర్గంలోని విద్యార్థుల సంఖ్య	
గంగాధరనెల్లూరు	6099
శ్రీరంగరాజుపురం	3139
కార్వేటినగరం	6818
వెదురుకుప్పం	5279
పెనుమూరు	5861
పాలసముద్రం	3214
మొత్తం	24649

ఇలా నివారించవచ్చు



పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి. మాత్రను భోజనం తర్వాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకరోజు లేదా రెండురోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.

– మోహన్‌కృష్ణ, వైద్యాధికారి, పాలసముద్రం

వైద్య సిబ్బంది పర్యవేక్షణ అవసరం..



ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్రను 200 మిల్లీగ్రాముల నీళ్లలో కలిపి పట్టించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీగ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. పాఠశాలల్లో బోధన సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్బెండజోన్ మాత్రలు నమిలి మింగించేలా చూడాలి.

– వినతశ్రీ, గంగాధరనెల్లూరు ప్రాజెక్టు, సీడీపీఓ

మాత్రల పంపిణీ



గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ప్రభుత్వం ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు మొత్తం 24649 మంది ఉన్నారు. వీరికి ఆల్బెండజోన్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేశాం. నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను మింగిన వారికి ఈ నెల 16న స్పెషల్‌డ్రైవ్ పెట్టి మాత్రలు మింగేలా చూస్తాం.

– రవిరాజు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్

ఎన్నికలు సజావుగా జరగాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట్రామిరెడ్డి

నగరి : ఎన్నికలను సజావుగా జరిపించాలని ఆర్డీఓ, ఎన్నికల ఈఆర్వో వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం వెలుగు సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి ఏఈఆర్వోలు, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఈడీఎంలు, రూట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మండల సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సాధారణ ఎన్నికల విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల క్లెయిమ్స్ 6, 7, 8కి సంబంధిత చేర్పులు, తొలగింపులు, సవరణల గురించి కొన్ని ముఖ్యమైన సూచనలు ఇచ్చారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. మండల సర్వేయర్లు సెక్టార్లకు సంబంధిత రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ఎన్నికల క్లెయిమ్స్‌లను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.

జీవనోపాధిని మెరుగు పరుచుకోండి

పాలసముద్రం : ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న వివిధ రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీదు మస్తాన్ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘ లీడర్లు, సంఘమిత్ర, సీసీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీనిధి, ఉన్నతి, సున్నావడ్డీకి బ్యాంకు లింకేజీ రుణాలను తీసుకున్న డ్వాక్రా సంఘ సభ్యురాలు ఆదాయం ఎక్కువ వచ్చేవాటిపై పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. తీసుకున్న రుణాలను నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘ సభ్యులు పొదుపు నగదు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ లోకనాథం, చిరంజీవి, సంఘమిత్ర, లీడర్లు పాల్గొన్నారు.



వేపగుంట-అక్కేరిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా



మంత్రి రోజాను సత్కరిస్తున్న గ్రామస్తులు

దశాబ్దాల రోడ్డు సమస్యకు పరిష్కారం

- రైల్వే అధికారులతో మంత్రి రోజా చర్చలు సఫలం
- వేపగుంట– అక్కేరిరోడ్డు పనులు ప్రారంభం

పుత్తూరు: రైల్వే శాఖ ఆక్షేపణలతో దశాబ్దాల పాటు రోడ్డు లేక సతమతమవుతున్న అక్కేరి గ్రామస్తుల సమస్య పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చొరవతో పరిష్కరించబడింది. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట గ్రామ రైల్వేలైన్ క్రాస్ నుంచి అక్కేరి దళితవాడ వరకు రోడ్డు, డ్రైనేజీ పనులకు మంత్రి రోజా గురువారం భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ రాజ్ నిధులు రూ.5 లక్షల అంచనా వ్యయంతో 540 మీటర్ల మేరకు రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ట్రైన్స్ నడుస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ అన్నిచోట్ల రైల్వే హద్దులను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో అక్కేరి రోడ్డు పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు, డ్రైనేజీ పనులు తన చేతుల మీదుగానే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులను ప్రారంభించిన మంత్రి రోజాను గ్రామస్తులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఆఫీసర్ బాలాజీ, ఎంపీడీఓ ప్రసాద్, పీఆర్ డీఈఈ వెంకటవినోద్‌రెడ్డి, ఏఈ వీరయ్య, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణమూర్తి, నాయకులు, ఉదయ్, అఖిల్, శాంతకుమార్, యువరాజు, ఆంథోని, జయకుమార్, నరసింహులు, రమేష్, వెంకటేశ్వర్లు, షబీషన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్బళగన్, తులసి

పాలసముద్రం : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. గురువారం తమ పార్టీ కార్యకర్తలతో కలసి ప్రభుత్వం పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న తీరు, పాలనలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. పార్టీ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందని ప్రతీ ఒక్కరి ఓటు పార్టీకి పడేలా చూడాలని తెలిపారు. మరోరెండు నెలలు కష్టపడితే అధికారం మళ్లీ మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ అయ్యప్ప, మహేష్, నాయకులు మురుగేష, త్యాగరాజ్, చంద్రశేఖర్‌రాజు, నరసింహనాయుడు, రవిరెడ్డి వేణు, షణ్ముగరెడ్డి, ధనుంజయరెడ్డి, పయణి, వెంకటేష్, ఆనందన్, ప్రకాష్, సుబ్రమణ్యం, నరసింహన్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

మండలంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. శుక్రవారం మధ్యాహ్నం ఆయన పాలసముద్రంలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్, సింగిల్‌విండో కార్యాలయంలో ఏటీఎం యంత్రాన్ని ప్రారంభిస్తారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రానున్న రోజుల్లో పారిశుద్ధ్యం పనుల్లో మార్పు రావాలని మండల ప్రజాపరిషత్ ఆఫీసర్ రామనాథరెడ్డి తెలిపారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీర్ అసిస్టెంట్లకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ పరిధిలో పర్యటించి, పారిశుద్ధ్య పనులు సమగ్రంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎక్కడైనా పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులు బాధ్యతలు కేటాయించాలని ఆదేశించారు. రోడ్లపై, కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు శానిటరీ అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీమంత్రి చెంగారెడ్డికి ఆహ్వానం



మాజీమంత్రి చెంగారెడ్డిని ఆహ్వానిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : దేశమ్మ ఆలయ మహాకుంభాభిషేకానికి మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డికి మంత్రి ఆర్‌కే రోజా ఆహ్వానం పలికారు. ఈ నెల 11వ తేదీన జరిగే నేత్ర ప్రదాయనీ నూతన ఆలయ కుంభాభిషేక వేడుకల్లో కలుసుకోవాలని కోరారు. ఆమె వెంట ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్ దయానిధి తదితరులు పాల్గొన్నారు.

బుక్కాపట్నం ప్రభుత్వ స్కూల్ తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

గంగాధర నెల్లూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని, నాణ్యమైన సూచి శుభ్రమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. మండలంలోని బుక్కాపట్నం ప్రభుత్వ పాఠశాలను ఆయన గురువారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి బాగుందని ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీలు దేవేంద్ర, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం



మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్న శ్రీగురుదత్త మఠం వ్యవస్థాపకుడు సూర్యనారాయణమూర్తి

తిరుపతి కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన శ్రీగురుదత్త మఠం వ్యవస్థాపకుడు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు తలపెట్టిన మహా రుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజా మహోత్సవాలు గురువారం శ్రీపద్మావతి కల్యాణ మండపం బ్లాక్–2లో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ మండపాలలో సుమారు 60 మందికి పైగా రుత్వికులు పాల్గొని వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మహా రుద్రాభిషేకంతో పాటు చండీపారాయణం, చండీహోమం, రుద్ర, నక్షత్ర, నవగ్రహ, వాస్తు లక్ష్మీ గణపతి వంటి హోమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు మహారుద్రాభిషకంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ లోకకల్యాణార్థం, మానవాళి సుభిక్షతను కాంక్షిస్తూ గత 19 ఏళ్లుగా ప్రతి ఏటా పుష్యమాసం బహుళ చతుర్దశి నాడు వివిధ ప్రాంతాల్లో ఈ మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజామహోత్సవాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ ఏడాది తిరుమల శ్రీవారి పాదాల చెంతనున్న ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో రెండురోజుల పాటు రుత్వికులచే ఈ మహా రుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా రెండవ రోజైన శుక్రవారం శ్రీకామాక్షి అమ్మవారికి పదివేల సార్లు శ్రీసూక్త, దుర్గాసూక్తములతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. మానవాళి క్షేమం కోసం చేపడుతున్న ఈ మహా రుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజా మహోత్సవంలో భక్తులంతా పాల్గొని పరమేశ్వరుడు, అమ్మవారి కృపాకటాక్షాలు అందుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల వేళ అప్రమత్తమైన రైల్వే పోలీసులు



పుత్తూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న రైల్వే డీఎస్పీ షానుషేక్



ట్రైన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ షానుషేక్ బృందం

- అక్రమ నగదు, మద్యం రవాణాపై ఉక్కుపాదం
- రైల్వేస్టేషన్లు, ట్రైన్స్‌లో ముమ్మర తనిఖీలు
- రేణిగుంట రైల్వే డీఎస్పీ షానుషేక్ నేతృత్వంలో పటిష్ట చర్యలు

పుత్తూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైల్వే పోలీస్ శాఖ పటిష్ట చర్యలకు ఉపక్రమించింది. గురువారం పుత్తూరు రైల్వేస్టేషన్‌లో రేణిగుంట రైల్వే డీఎస్పీ షానుషేక్ నేతృత్వంలోని పోలీస్ బృందం ముమ్మర తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన పుత్తూరు, నగరి మీదుగా ప్రయాణించే రైళ్లలో అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు కార్యాచరణ మొదలైందని తెలిపారు. ప్రత్యేక డాగ్ స్క్వాడ్ టీమ్స్ అన్నివేళలా అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. రశీదులు లేని నగదు, ఇతర వస్తువులను తరలిస్తుంటే వాటిని సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రయాణికులకు అక్రమ రవాణా సమాచారం తెలిస్తే రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం స్థానిక అధికారులతో సమావేశమై తగిన సూచనలు ఇచ్చారు. ట్రైన్స్‌లో ప్రయాణిస్తూ డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే సీఐ దేవేంద్ర కుమార్, ఎస్ఐ రవి, స్టేషన్ మాస్టర్ రంగేజికుమార్ తదితరులు పాల్గొన్నారు.